క్లుప్తంగా

మత్స్యకారులను ఆదుకోవాలి

భైంసాటౌన్: గత వానాకాలంలో భారీ వర్షాలకు భైంసా మండలంలోని సిరాల చెరువు తెగి మత్స్యకారులు నష్టపోయారని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు. సోమవారం బోసి, బోల్సా, ఉమ్రి, సిరాల గ్రామాలకు చెందిన మత్స్యకారులు పట్టణంలో ఎమ్మెల్యే రామారావుపటేల్‌ను కలిసి విన్నవించారు. సిరాల ప్రాజెక్టు తెగిపోవడంతో ఏడాదిగా ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నామని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకోవాలని కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే మత్స్యకారుల సంక్షేమానికి తనవంతు కృషిచేస్తానన్నారు. బోసి మాజీ సర్పంచ్ ఆనంద్, నాయకులు రాజు, శంకర్, గంగాధర్, నాగన్న, సాయి, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

నగదు విరాళం



విరాళం అందిస్తున్న సై యూత్ సభ్యులు

లోకేశ్వరం: మండల కేంద్రంలోని భగీరథ పెద్ద చెరువు కట్ట హనుమాన్ ఆలయ నిర్మాణానికి సై యూత్ సభ్యులు రూ.25వేల నగదు విరాళంగా సోమవారం అందజేశారు. నాయకుడు కపిల్, గ్రామస్తులు రెడ్డిశెట్టి గణేశ్, నరేందర్, రమేశ్, నవీన్ ఉన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ఖానాపూర్: మండలంలోని పాతతర్లపాడ్ గ్రామంలో సోమవారం పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రం, తదితర చోట్ల పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యదర్శి సురేష్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

మార్కెట్ చైర్మన్ పదవి మాదిగలకే ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎస్.దిగంబర్

కుభీర్: కుభీర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి మాదిగ సామాజిక వర్గానికే ఇవ్వాలని అన్నబాహుసాఠే సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.దిగంబర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండేళ్ల క్రితం కుభీర్ మార్కెట్ పదవి ఎస్సీలకు రిజర్వు అయినా భర్తీ చేయలేదన్నారు. వెంటనే మాదిగ సామాజిక వర్గానికే ఇస్తూ భర్తీ చేయాలని లేకపోతే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతామన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు జీవన్, అడెల్లు తదితరులు పాల్గొన్నారు.

బాసరలో కార్తీక పూజలు

భైంసా: కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా బాసరలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యేశ్వరస్వామి ఆలయంలో వైదిక బృందం ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. వేద పాఠశాలలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పాఠశాల విద్యార్థులు గోదావరి నది ఒడ్డున హోమ పూజలు నిర్వహించి గంగా హారతి ఏర్పాటు చేశారు. గంగా హారతిలో వందలాదిగా భక్తులు పాల్గొన్నారు. కార్తీకమాసం సందర్భంగా వచ్చిన భక్తులంతా గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

భైంసా: బాసరలోని బీసీ, ఎస్సీ, వసతిగృహ విద్యార్థులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గంగప్రసాద్ మాట్లాడుతూ వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు.

ప్రణాళికలు సిద్ధం చేయాలి

లోకేశ్వరం: 2025–26 సంవత్సరానికి బడ్జెట్ పనుల ప్రణాళికలను సిద్ధం చేయాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడు తూ ఉపాధి కూలీలు పనులకు వచ్చేలా చూ డాలన్నారు. గ్రామాల్లో చెత్తాచెదారం లేకుండా చూడాలని సూచించారు. సమావేశంలో ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

నిర్మల్‌టౌన్: జిల్లా బ్రాహ్మణ విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజేశ్వర్ పాండే, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా ప్రతాప్ నాగేశ్వరరావు, అదనపు కార్యదర్శిగా శిరీష్ కుమార్, కోశాధికారిగా భీమ్‌రావు ఎన్నికయ్యారు.

వానరం భయం..భయం

- పల్లెల్లో గుంపులుగా సంచారం
- దాడి చేసి గాయపరుస్తున్న కోతులు
- రోడ్లపై వెళ్లాలంటే జంకుతున్న ప్రజలు



ఖానాపూర్‌లోని విద్యానగర్‌లో సంచరిస్తున్న కోతుల గుంపు

ఖానాపూర్: వనంలో ఉండాల్సిన వానరాలు..ఆహారం దొరకక గ్రామాల్లో తిష్టవేస్తున్నాయి. ఇవి గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. పట్టణంతోపాటు పల్లెల్లోవీటి బెడద తీవ్రంగా ఉంది. ఇళ్లల్లో చొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయి. సామగ్రిని ధ్వంసం చేసి వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సమయంలో నిర్వాహకులు, విద్యార్థులు, రోడ్లపై వెళ్లే చిన్నాపెద్దలు, వృద్ధులపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. రోడ్లపై వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. ప్రధాన రోడ్లు, వీధుల్లో కోతులు తిష్ట వేస్తుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అదేవిధంగా పంట చేలు, మామిడి, జామ తోటల్లో వానరాలు గుంపులుగా వచ్చి తీవ్ర నష్టాన్ని చేకూరుస్తున్నాయి. వాటి బారినుంచి పంటలు కాపాడుకునేందుకు రైతులు రాత్రింబవళ్లు అక్కడే పడిగాపులు కాస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా సోలార్ ఫెన్సింగ్ అందించాలని వారు కోరుతున్నారు.

ఆహారం దొరకక..

కోతుల బారి నుంచి కాపాడాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని వాపోతున్నారు. శాఖల అధికారులు పలుమార్లు కోతులను బోనుల్లో బంధించి అటవీప్రాంతంలో వదిలిపెట్టేవారు. అయినప్పటికీ అక్కడ ఆహారం దొరకక జనావాసాల్లోకి వస్తున్నాయి. ఇటీవల కోతుల దాడిలో పట్టణానికి చెందిన లక్ష్మి మృతి చెందింది. వీటి బెడద నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని లక్ష్మి కుటుంబ సభ్యుడు అమర్ కోరారు. ఈమేరకు వీడీసీ నాయకులు, ఆయా పార్టీల నాయకులు తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

కోతుల పునరావాస చర్యలేవి?

జిల్లాకేంద్రంలో ప్రభుత్వం కోతుల పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కోతులను పట్టుకునేందుకు మంకీ క్యాచర్స్ టీంలను ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రత్యేక బోనులు, ఉచ్చులు ఏర్పాటుచేసి అందులో ఆహారం ఎరగా వేసి పట్టుకుని అటవీ ప్రాంతాల్లో వదలాలి. లేకపోతే పునరావాస కేంద్రానికి తరలించాలని పేర్కొంటున్నారు.



మహిళ మృతి చెందిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్సై(ఫైల్)



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజలు (ఫైల్)

చర్యలు చేపడుతాం



కోతుల బెడద నివారణకు చర్యలు చేపడుతాం. ప్రజలు ఈ విషయంపై తమ దృష్టికి తీసుకువచ్చారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యులతో చర్చించాం. వీటి బెడద నివారణకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తాం.

– మనోహర్, మున్సిపల్ కమిషనర్, ఖానాపూర్

చేపపిల్లలు మృత్యువాత

- నాసిరకం చేపపిల్లలు ఇచ్చారని మత్స్యకార సంఘాల ఆరోపణ

దస్తురాబాద్: మండలకేంద్రంతోపాటు బుట్టాపూర్, చెన్నూర్, మున్యాల గ్రామాల్లోని చెరువుల్లో చేపపిల్లలు మృత్యువాతపడ్డాయి. కాంట్రాక్టర్ ఇచ్చిన చేపపిల్లలను మత్స్యకారులు సోమవారం రాత్రి చెరువుల్లో వదిలితే కొన్ని చనిపోయాయి. మండల కేంద్రంలోని ప్రధాన చెరువులో లక్ష చేప పిల్లలు పంపిణీ చేయాల్సి ఉండగా కేవలం 30 వేల చేప పిల్లలను ఇచ్చి చేతులు దులుపుకున్నారు. నాసిరకం చేపపిల్లలు ఇవ్వడంతోనే మృత్యువాతపడ్డాయని మత్స్యకార సంఘాలు ఆరోపించాయి. కాగా, మండలంలోని మత్స్యకారుల సొసైటీ చేపల చెరువులకు ప్రభుత్వం 50 శాతం మాత్రమే చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. మిగతా 50 శాతం పంపిణీ చేయడం లేదు. కాంట్రాక్టర్ ఇచ్చిన చేప పిల్లలు మృత్యువాతపడ్డాయి. ఈ విషయమై మత్స్యశాఖ ఏడీ రాజనర్సయ్యను సంప్రదించగా కిందిస్థాయి అధికారికి ఫోన్ చేసి చెప్పాలన్నారు. తనకు ఎందుకు ఫోన్ చేసి అడుగుతున్నారని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే రామారావు పటేల్



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

కుంటాల: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. మండలంలోని కల్లూరు శ్రీ దత్త వెంకటసాయిబాబా ఆలయ స్వాగతతోరణం, ప్రహరీ నిర్మాణానికి దేవాదాయశాఖ నిధులు రూ.45 లక్షలతో సోమవారం భూమి పూజచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, ఏఎంసీ డైరెక్టర్ రామేశ్వర్, నాయకులు రమణాగౌడ్, జీవీ రమణారావు, చిన్నారెడ్డి, లక్ష్మణ్ పటేల్, గుద్దేటి నర్సయ్య, సుదర్శన్ పటేల్, గంగాధర్ పటేల్, వసుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ముథోల్: ముథోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి వినయ్ జోనల్‌స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయినట్లు పీడీ శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కేంద్రం నిర్మల్‌లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–17 బాలుర కబడ్డీ పోటీల్లో జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి జోనల్ స్థాయికి ఎంపికయ్యాడు. ఆదిలాబాద్‌లో జరిగే జోనల్‌స్థాయి పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు.

పాపహరేశ్వరాలయంలో భక్తుల రద్దీ

దిలావర్‌పూర్: కార్తీకమాసం సందర్భంగా మండల కేంద్రంలోని మాతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయం సోమవారం భక్తులతో రద్దీగా మారాయి. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దీపారాధన చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నార్వాడి వెంకట్రావు పాటిల్ అన్న పూజ నిర్వహించారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఆందోళన



అధికారులతో వాగ్వాదానికి దిగిన యువకులు, గ్రామస్తులు

తానూరు: మండల కేంద్రంలో ప్రభుత్వ భూమిలో వ్యాపారం కోసం వేలం ద్వారా దక్కించుకున్న వారే దుకాణాలను కొనసాగించాలని పలువురు యువకులు సోమవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. గతంలో వేలం ద్వారా దుకాణాలను దక్కించుకున్నవారు ఇతరులకు అద్దెకు ఇచ్చి లక్షలు తీసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొంత మంది వ్యాపారం కోసం ప్రభుత్వ భూమిని అద్దెకు తీసుకుని అందులో షెడ్లు వేసుకుని వ్యాపారం చేయకుండా ఇతరులకు అద్దెకు ఇస్తున్నారని తెలిపారు. తానూరు వాసులకు వ్యాపారం కోసం స్థలం దొరకడం లేదన్నారు. దీనిపై సోమవారం యువకులు సొంత స్థలంలో కర్రలు ఏర్పాటు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ లింగమూర్తి, ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఎంపీవో నసీరొద్దీన్ అక్కడికి చేరుకున్నారు. ప్రభుత్వ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని సూచించారు. దీంతో యువకులు అధికారులను నిలదీశారు. కొంత మంది షెడ్లు ఏర్పాటు చేసుకుని అద్దెకు ఇస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తహసీల్దార్ లింగమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని సూచించారు. మొత్తం 22 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని వేలం ద్వారా దక్కించుకున్న వారే దుకాణాలు కొనసాగించేలా చూస్తామన్నారు. వారం రోజుల్లో సర్వే నిర్వహించి భూమిని గుర్తిస్తామన్నారు. ఇతరుకు అద్దెకు ఇస్తే నోటీసులు ఇస్తామన్నారు. కొంత మంది యువకులు మాట్లాడుతూ బస్టాండ్ ప్రాంతంలో అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించేలా చూడాలన్నారు. ఇందుకు అధికారులు అంగీకరించారు.

ఉపాధి పనుల ఎంపికపై గ్రామసభలు

తానూరు: హంగిర్గా, బోరిగాం గ్రామాల్లో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి పనుల ఎంపిక, ప్రణాళికపై సోమవారం గ్రామసభ నిర్వహించారు. చేపట్టే పనుల ప్రణాళికలను తయారు చేసి గ్రామస్తులకు వినిపించారు. ఈ ఏడాది పొలాలకు వెళ్లే రహదారులు, పూడికతీత పనులు చేపడుతున్నట్లు ఏపీవో గంగాధర్ తెలిపారు.

కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



మామడ: కొరిటికల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి



సారంగాపూర్: పొట్యలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ

మామడ: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొరిటికల్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కొరిటికల్ నుంచి పోతారం గ్రామానికి వెళ్లే రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు ఎమ్మెల్యేని కోరగా, సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నాయకులు రావుల రాంనాథ్, బాపురెడ్డి, ఏలేటి చిన్నారెడ్డి, చిన్న లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): గొల్లమాడలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ సహాయ సంచాలకుడు భాస్కర్ సోమవారం పరిశీలించారు. ఏవో రాంచందర్ నాయక్, ఏఈవో గణేశ్, నిర్వాహకుడు గోస్కుల భూమయ్య ఉన్నారు.

సోన్: మండల కేంద్రంలోని పీఏసీఎస్, డీసీఎంఎస్, న్యూబొప్పారంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సన్నరకానికి ప్రభుత్వ మద్దతు ధర రూ.2300, రూ.500 బోనస్‌తో కలిపి రూ.2800 చెల్లిస్తోందన్నారు. నాయకులు రావుల రాంనాథ్, మేడిసిమ్మె రాజు, సరికెల గంగన్న, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్‌రెడ్డి, అడ్వాల రమేశ్, తహసీల్దార్ మల్లేశ్, ఎంపీడీవో సురేశ్, ఎంపీవో ఖలీల్, ఏవో వినోద్‌కుమార్, ఏఈవోలు, వీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కడెం: మండలంలోని సారంగపూర్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ సుజాత సోమవారం ప్రారంభించారు. ఆర్ఐ తక్కన్న, నాయకులు కుమ్మరి సుధాకర్, కోల శ్రీనివాస్, కుమ్మరి బుచ్చన్న, జెట్టి నర్సయ్య, నర్సయ్య, కోల నర్సయ్య, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

సారంగాపూర్: స్వర్ణ, పొట్యా గ్రామాల్లో ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు. అనంతరం ఆయన్ను గ్రామస్తులు సన్మానించారు. రైతులు, డైరెక్టర్లు, తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కుభీర్: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో హమాలీలకు పోలీసులు సోమవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితులు ఫోన్ చేసి బ్యాంక్ అకౌంట్, ఆధార్ నంబర్లు అడిగితే వివరాలు చెప్పవద్దన్నారు. అదే విధంగా ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై యశ్వంత్, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

ముథోల్: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంఈవో రమణారెడ్డి అన్నారు. మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో అధికారులకు పలు సూచనలు అందించారు. ప్రాథమిక, ఉన్నత, యూపీఎస్ పాఠశాలల రోజువారీ నిర్వహించే కార్యక్రమాల వివరా లు, యూడైస్ తదితర వివరాలను తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్నవాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎఫ్ఏ1, ఎ ఫ్ఏ2, ఎస్ఏ1 మార్కులను వెబ్‌సైట్‌లో క్రోడీకరించాలని, ప్రతీ పాఠశాలలో గ్రంథాలయ పీరియడ్ ఉంచి ప్రభుత్వం అందించే వివిధ రకాల పుస్తకాలను చదివించాలని సూచించారు. డిసెంబర్ 4న దేశ వ్యాప్తంగా నిర్వహించే ఎన్ఏఎస్ ప రీక్ష, 3, 6, 9 విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఆయా కాంప్లెక్సుల హెచ్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

టీజీబీ నూతన శాఖ ప్రారంభం

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ 437వ నూతన శాఖను బ్యాంకు చైర్మన్ టీ.శోభ, రీజినల్ మేనేజర్ డీపీఎస్ రామారావు సోమవారం ప్రారంభించారు. ఎస్ఎంవో అభినయ్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్ సతీశ్‌కుమార్, కోశాధికారి చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడిగా చిన్నారెడ్డి

నిర్మల్‌టౌన్: సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడిగా పాషపు చిన్నారెడ్డిని నియమించినట్లు నేషనల్ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్ తెలిపారు. ఈమేరకు నియామక పత్రం సోమవారం హైదరాబాద్‌లో అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ.. సంస్థ సూచనలు, పెద్దల ఆదేశాల మేరకు సామాజిక అభివృద్ధి మానవ హక్కుల పరిరక్షణకు పాటుపడతానని పేర్కొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

లోకేశ్వరం: విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని నిర్మల్ ఐటీఐ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని హవర్గ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఐటీఐ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి తన సొంత డబ్బులు రూ.10 వేలతో స్కూల్ బ్యాగులు, పెన్నులు తదితర అందజేశారు. ఎంఈవో చంద్రకాంత్, హెచ్ఎం సురేష్‌రావు, తాజామాజీ సర్పంచ్ భుజంగ్‌రావు, నాయకుడు సాయారెడ్డి, ఎఫ్ఏ పోశెట్టి ఉన్నారు.

రేపు సీసీఐ ద్వారా పత్తికొనుగోళ్లు

కుభీర్: కుభీర్ మార్కెట్‌లో బుధవారం సీసీఐ ద్వారా పత్తికొనుగోళ్లు ఉంటాయని మార్కెట్ కార్యదర్శి గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్ రూ.7521 ఉందని పేర్కొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

భైంసా: బాసర మండలంలోని రువ్వి, కిర్గుల్(కె), బాసరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే రామారావుపటేల్ ప్రారంభించనున్నారు. మంగళవారం మూడు కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారు.

పరామర్శ

నిర్మల్‌టౌన్: డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు మామ జువ్వాడి సూర్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి.. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం తిమ్మాపూర్‌లో సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట విజయ డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి, అల్లోల మురళీధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఒస రాజేశ్వర్, మాధవరావు ఉన్నారు.

ఒకరిపై కేసు

నర్సాపూర్(జి): మద్యం మత్తులో డయల్ 100కు ఫోన్ చేసిన వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. మండలంలోని గొల్లమాడ గ్రామానికి చెందిన చెన్న గణేశ్ ఆదివారం అర్ధరాత్రి మద్యం మత్తులో డయల్ 100కు ఫోన్‌చేసి పెట్రోకార్ విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు చౌహాన్ కృష్ణ, సంజీవ్‌లను గ్రామానికి రమ్మని విసిగించాడు. ఈ మేరకు గణేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యం పట్టివేత

లోకేశ్వరం: మండలంలోని వాస్తాపూర్ గ్రామంలో బెల్ట్ షాపుపై ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో సోమవారం దాడి చేసి మద్యాన్ని పట్టుకున్నారు. పక్కా సమాచారంతో దాడి చేసి రూ.5910 విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. బెల్ట్ షాపు నిర్వాహకుడు బొమ్మన భోజన్నపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గౌడ సంఘం జిల్లా మహాసభ జయప్రదం చేయాలి

ఖానాపూర్: జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో బుధవారం నిర్వహించే గౌడ సంఘం జిల్లా 4వ మహాసభ జయప్రదం చేయాలని గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ గౌడ్ కోరారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. గీత కార్మికుల సమస్యలు, ఇతర డిమాండ్లపై మహాసభల్లో చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. మహాసభలకు జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. నాయకులు కాసారపు మల్లాగౌడ్, బుర్ర ప్రకాశ్‌గౌడ్, ఒల్లాల చిన్న నర్సాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కుంటాల: మండలంలోని లింబా(కె) గ్రామానికి చెందిన చందుల గంగాధర్ చెరువులో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం గ్రామస్తులు రూ.18,200 నగదు పోగుచేసి భార్య సరితకు అందజేశారు.

'బీజేపీతోనే అభివృద్ధి'

కుంటాల: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ క్రియాశీల సభ్యత్వ కన్వీనర్ సూర్యవంశీసాయి అన్నారు. మండలంలో లింబా(బి) గ్రామంలో 100 సభ్యత్వాలను పూర్తి చేసిన సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడారు. దేశంలో అధిక సభ్యత్వాలు గల పార్టీ బీజేపీ అని పేర్కొన్నారు. నారాయణ, రాం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కులం పేరు సవరించాలి

కడెం: నేతకానిల కులం పేరు నేతాని ఉందని, నేతకానిగా మార్పు చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ కోరారు. సోమవారం మంచిర్యాలలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న కులగణనలో నేతకానిగా మార్పు చేయిస్తానని హామీ ఇచ్చారని వెంకటేశ్ తెలిపారు.

ఘనంగా భీమన్న జాతర



అగ్ని గుండం నుంచి దాటుతున్న భక్తులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో భీమన్న పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం భీమన్న గదలను గోదావరికి తీసుకుపోవడంతో ప్రారంభమైన జాతర సోమవారం ముగిసింది. ఆదివారం గదలను గోదావరికి తీసుకెళ్లిన గ్రామస్తులు సోమవారం ఉదయం వాటిని ఆలయంలోని తీసుకవచ్చారు. దీంతో వాటికి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఉదయం నుంచే ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రంతోపాటు, ధర్మారం, పీచర, మునిపెల్లి, పొట్టపెల్లికే, మల్లాపూర్, తిర్పెల్లి గ్రామాలకు చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చారు. భీమన్న వద్ద పూజలు చేశారు. నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి కూడా భీమన్నను దర్శించుకున్నారు.

అగ్నిగుండం దాటిన భక్తులు

భీమన్న ఆలయం ముందు అగ్నిగుండం ఏర్పాటు చేశారు. అగ్నిగుండం దాటితే కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం. దీంతో వందలాది భక్తులు అగ్ని గుండం దాటారు. వారి కోసం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ప్రారంభమైన శత చండీయాగం

భైంసా: భైంసాలోని అన్నపూర్ణ క్షేత్రంలో గల అయ్యప్పస్వామి ఆలయంలో శత చండీయాగం ప్రారంభమైంది. ఉదయం వేళ గోవులకు పూజచేసి యాగాన్ని ప్రారంభించారు. గురుస్వామి సాయినాథ్, వేద పండితులు యాగాన్ని కొనసాగించారు. దంపతులు సామూహికంగా పూజల్లో పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

ఖానాపూర్: రాజురాలో శ్రీ శివపంచాయతన శివ మార్కండేయ ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. పండితుడు రాజశేఖర్ శర్మ బృందం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. మార్కండేయ నవగ్రహ ధ్వజస్తంభ సహిత ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా విగ్రహమూర్తులను పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయకమిటీ సభ్యులు ఉన్నారు.